# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

తేది : 31-01-2026 సమయం : 6.45 గంటలు

## ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 'పేదల సేవ'లో అనే కార్యక్రమంలో బాగంగా చిత్తూరు జిల్లా బెగ్గిలిపల్లె గ్రామంలో లబ్ధిదారులకు పింఛన్లను ఈ రోజు పంపిణీ చేయనున్నారు.**
2. **ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసేందుకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.**
3. **ఉద్యాన పంటలకు కేంద్రంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.**
4. **మేడారం శ్రీ సమ్మక్క–సారలమ్మ అమ్మవార్లను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ నిన్న దర్శించుకున్నారు.**
5. **రాజధాని రైతులకు సంబంధించిన అన్ని సమస్యలు పరిష్కరిస్తామని ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు.**

-----------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్తూరు జిల్లా కుప్పంలో రెండవ రోజు పర్యటనలో భాగంగా 'పేదల సేవ'లో అనే కార్యక్రమంలో గుడుపల్లె మండలం

బెగ్గిలిపల్లె గ్రామంలో లబ్ధిదారులకు సామాజిక భద్రత పింఛన్లను ఈ రోజు పంపిణీ చేయనున్నారు. అనంతరం ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించనున్నారు. సాయంత్రం జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు వివిధ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకునే కార్యక్రమంలో పాల్గొంటారు. కుప్పం మాస్టర్ ప్లాన్, మోడల్ బస్ స్టాండ్ డిజైన్లను ముఖ్యమంత్రి సమీక్షిస్తారు.

-----------------------

తెలంగాణలోని ములుగు జిల్లా మేడారం శ్రీ సమ్మక్క–సారలమ్మ అమ్మవార్లను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ నిన్న దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్ తులాభారం నిర్వహించారు. గవర్నర్‌కు మంత్రి దనసరి సీతక్క, జిల్లా ఉన్నతాధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఉత్సవాల సందర్భంగా ఏర్పాట్లను, ఆలయ పరిసరాలను ఆయన పరిశీలించారు. అదేవిధంగా అమ్మవార్లను పలువురు ప్రముఖులు నిన్న దర్శించుకున్నారు. వీరిలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ మంత్రులు దనసరి సీతక్క, కొండా సురేఖ, పార్లమెంట్ సభ్యులు  పోరిక బలరాం, పలువురు ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు ఉన్నారు.

-----------------------

ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసేందుకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్  పేర్కొన్నారు. విశాఖపట్నం కలెక్టరేట్ లో ఉత్తరాంధ్ర జిల్లాల పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఇంజినీరింగ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులతో సమీక్షా సమావేశాన్ని ఆయన నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పంచాయతీ రాజ్ శాఖను ప్రభావవంతమైన శాఖగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ఉన్నట్లు తెలిపారు.

-----------------------

ఉద్యాన పంటలకు కేంద్రంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. కోకో ఉత్పత్తిలో రాష్ట్రం దేశంలోనే ప్రధమ స్థానంలో ఉందన్నారు. కోకో సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.  ఏలూరు జిల్లా కేంద్రంలో రాష్ట్ర స్థాయి కోకో సదస్సును మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

(వాయిస్.. 25 సెకన్లు)

-----------------------

రాజధాని రైతులకు సంబంధించిన అన్ని సమస్యలు పరిష్కరిస్తామని ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. రాజధాని అమరావతికి భూములు ఇచ్చిన రైతుల సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన త్రి సభ్య కమిటీ భేటీ అమరావతిలోని సిఆర్డిఎ కార్యాలయంలో నిన్న జరిగింది.  ఈ సమావేశంలో కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ  సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పి.నారాయణ మాట్లాడుతూ..

(వాయిస్.. 31 సెకన్లు)

-----------------------

ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు ఈ రోజు అందజేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్న మధ్య తరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా  62 లక్షల 94 వేల మంది

పింఛనుదారులకు 2 వేల 724 కోట్ల రూపాయలను సచివాలయ సిబ్బంది  లబ్ధిదారుల ఇంటివద్దనే అందజేయడం జరుగుతుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెలలో కొత్తగా 7 వేల 944 మందికి వితంతు పింఛన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు.

----------------------

చిత్తూరు జిల్లా కుప్పం పర్యటనలో భాగంగా మున్సిపాల్టీ పరిధిలో స్వర్ణ నవ దిశ కో-వర్కింగ్ స్పేస్ సెంటర్ ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిన్న ప్రారంభించారు. హైస్పీడ్ ఇంటర్నెట్, ఏసీ, ప్యాంట్రీ, స్టోరేజ్ వసతులతో 50 మంది పని చేసుకునేందుకు అనువుగా ఈ కో-వర్కింగ్ స్పేస్ సెంటర్ రూపకల్పన చేశారు. ఈ సందర్భంగా అక్కడ పని చేస్తున్న యువతతో ముఖ్యమంత్రి మాట్లాడి అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు.

----------------------

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 16 నుండి 31వ తేదీ వరకూ..  దేశవ్యాప్తంగా "స్వచ్ఛత పక్షోత్సవాలు" - స్వచ్ఛతా పక్వాడాను నిర్వహిస్తున్నారు.ఇందులో భాగంగా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ రహిత వాతావరణంపై అవగాహన కలిగించడం, సమాజ భాగస్వామ్యం పెంచడం, మొక్కల సంరక్షణ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, ప్రజలు పారిశుద్ధ్య నిర్వహణ, శ్రమదాన కార్యక్రమాలను చేపడుతున్నారు.

----------------------

రోడ్డు భద్రతా ప్రమాణాలను పాటిస్తూ.. ప్రజల ప్రాణాలను కాపాడడంలో ఆర్టీసీ డ్రైవర్లు కీలకమైన భూమిక పోషిస్తున్నారని ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు

పేర్కొన్నారు. 37వ రహదారి భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని మచిలీపట్నం డిపోలో నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత ప్రమాణాలను పాటిస్తూ విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన డ్రైవర్లను అభినందిస్తూ ప్రశంస పత్రాలను, నగదు బహుమతలను ఆయన అందిజేశారు. అనంతరం ఆర్టీసీ చైర్మన్ మాట్లాడుతూ..

(వాయిస్.. 30 సెకన్లు)

----------------------

తెలంగాణ లోని ములుగు జిల్లా మేడారం మహాజాతర నాల్గవ రోజుకు చేరుకుంది. రాష్ట్రంతోపాటు పలు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు మేడారానికి చేరుకుంటున్నారు. జంపన్న వాగులో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు గద్దెల వద్ద అమ్మవార్లను దర్శించుకుంటుని, మొక్కుబడులు చెల్లించుకుంటున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు. భక్తుల అధిక సంఖ్యలో వస్తుండటంతో మేడారానికి వచ్చే రహదారులన్నీ రద్దీగా మారాయి.

----------------------

ఆంధ్రప్రదేశ్ యానాంలలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య, తూర్పు దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా యానాం, కోస్తా ఆంధ్ర,  రాయలసీమల్లో ఈ రోజు పొడి వాతావరణం ఏర్పడే  అవకాశం ఉందని వాతావరణ కేంద్ర అధికారి ఎల్. నారాయణ పేర్కొన్నారు.

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మిశ్రమ వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. పగటి వేళల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతుండగా, రాత్రి వేళల్లో చలి తీవ్రత నెలకొంటుంది. పలు చోట్ల పొగమంచు వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

తెలంగాణలో రానున్న 5 రోజుల పాటు పొడి వాతావరణం నెలకొంటుందని హైదరాబాదులోని వాతావరణ కేంద్రం పేర్కొంది.

-----------------------